క్లుప్తంగా

బాలిక అదృశ్యం

ఐనవోలు : మండలంలోని ఓ గ్రామానికి చెందిన మైనర్ బాలిక అదృశ్యమైనట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన తొమ్మిదో తరగతి చదువుతున్న బాలిక ఆదివారం ఇంట్లో తల్లిదండ్రులకు చెప్పకుండా బయటకు వెళ్లింది. రాత్రి ఇంటికి రాకపోవడంతో బంధువులు, స్నేహితులను ఆరా తీసినా ఆచూకి లభించలేదు. దీంతో మధ్యాహ్నం తల్లిదండ్రులు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ధర్మసాగర్‌లో వివాహిత..

ధర్మసాగర్ : మండల కేంద్రానికి చెందిన ఓ వివాహిత అదృశ్యమైనట్లు స్థానిక పోలీసులు సోమవారం తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన చిత్తనూరి రేఖ ధర్మసాగర్ పీఏసీఎస్ కార్యాలయ పనులతో పాటు ఆ సొసైటీ ఆధ్వర్యంలో గల ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వహణ పనులు కూడా చేపడుతుంది. ఈనెల 06న ఇంటి నుంచి వెళ్లిన ఆమె.. తిరిగి రాలేదు. దీంతో రేఖ భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి రిమాండ్

దామెర : మండల కేంద్రానికి చెందిన గందే రమేశ్‌కు వైద్య శాఖలో ఉద్యోగం ఇప్పిస్తానని 2018లో రూ. రూ.4.50 లక్షలు తీసుకొని మోసం చేసిన పరకాలకు చెందిన బొచ్చు భానుచందర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్ పంపినట్లు ఎస్సై అశోక్ తెలిపారు. బాధితుడు రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు రిమాండ్‌కు ఆయన వెల్లడించారు.

గొర్రె అపహరణ

దామెర : మండలంలోని కోగిల్వాయి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి గొర్రెలను గుర్తుల తెలియని వ్యక్తులు దొంగిలించారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. కోగిల్వాయి గ్రామానికి చెందిన జంగిలి రవి గొర్రెలు కాసుకుంటూ జీవనాన్ని కొనసాగిస్తున్నాడు. ఆదివారం అర్ధరాత్రి రవి ఇంటి పక్కనఉన్న తన తమ్ముడి గొర్రెల మందలోని గొర్రెలు అరుస్తుండడంతో రవి మంద వద్దకు రాగా ఓ గుర్తు తెలియని వ్యక్తి గొర్రెను అపహరించి కారులో తీసుకెళ్తుండగా రవి అతన్ని వెంబడించి పట్టుకున్నాడు. దీంతో ఆ వ్యక్తి రాయితో రవి తలపై మోదాడు. రవి కేకలు వేయడంతో చుట్టూపక్కలవారు వచ్చారు. దీంతో గుర్తుతెలియని వ్యక్తులు వారు వచ్చిన నంబర్‌ప్లేట్ లేని కారును అక్కడే వదిలి పారిపోయారు. బాధితుడు రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గొర్రెల కాపరికి అస్వస్థత

శాయంపేట : తాగునీరు అనుకుని పురుగుమందు కలిపిన నీటిని తాగిన గొర్రెల కాపరి అస్వస్థతకు లోనయ్యాడు. ఈ సంఘటన మండలంలోని సాదనిపల్లి గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఎదునూరి సాంబయ్య తన మొక్కజొన్న చేనుకు పురుగుల మందు పిచికారీ చేసేందుకు బాటిల్ నీటిలో మందు కలిపి పెట్టాడు. ఎండ తీవ్రత ఉండడంతో బాటిల్‌ను బావి వద్ద పెట్టి ఇంటికి వెళ్లాడు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన గొర్రెల కాపరి దైనంపల్లి ఐలయ్య గొర్రెలు మేపుకుంటూ బావి వద్దకు వెళ్లాడు. దాహం అవడంతో తాగునీరు అనుకుని బాటిల్లో ఉన్న పురుగుల మందు కలిపిన నీటిని తాగాడు. దీంతో ఐలయ్య అస్వస్థతకు గురై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన చుట్టుపక్కల రైతులు 108కు సమాచారం అందించగా టెక్నీషియన్ శ్రీనివాస్, డ్రైవర్ రాజు ప్రథమ చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం ములుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



నడికూడ : మండలంలోని కంఠాత్మకూరు, సర్వాపూర్, చర్లపల్లి గ్రామాల్లో ఇటీవల వివిధ కారణాలతో మృతిచెందిన బాధిత కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సోమవారం పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు.

పరకాల : మండలంలోని మల్లకపేట గ్రామానికి చెందిన దొమ్మాటి సువర్ణ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. కాగా బాధిత కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సోమవారం పరామర్శించారు.

ఆత్మకూరు : మండల కేంద్రంలో ఇటీవల సర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర మాజీ కార్యదర్శి చిదిరాల సుధాకర్‌రెడ్డికి మాతృవియోగం కలిగిన విషయం తెలిసిందే. కాగా సోమవారం మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అలాగే కొత్తగట్టులో బొజ్జ సమ్మక్క కుటుంబాన్ని పరామర్శించి బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. బీఆర్ఎస్ నాయకులు వెంకటేశ్వర్‌రావు, సుధాకర్, రవీందర్, ప్రవీణ్‌రెడ్డి, పైడి పాల్గొన్నారు.

బియ్యం అందజేత

శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక గ్రామానికి చెందిన బుట్టి లక్ష్మమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. కాగా ఆమె కుమారుడు చంద్రమౌళితో 1996–97లో పదోతరగతి చదువుకున్న మిత్రులు సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. క్వింటాల్ బియ్యాన్ని అందించారు. శంకర్, కిరణ్, భిక్షపతి, శ్రీనివాస్, ప్రసాద్ ఉన్నారు.

అధ్వానంగా అంతర్గత రోడ్లు

- తరచూ రోడ్డు ప్రమాదాలు
- మరమ్మతులు చేపట్టని అధికారులు
- డివిజన్ అంతా ఇదే పరిస్థితి
- ఆగ్రహిస్తున్న వాహనదారులు



గుడెప్పాడ్ జంక్షన్‌లో ప్రమాదకరంగా రోడ్డు

ఆత్మకూరు : పరకాల డివిజన్ పరిధిలో అంతర్గత రోడ్లు, వివిధ గ్రామాల లింకురోడ్లు గుంతలు పడి, కొట్టుకుపోయి, కంకరతేలి అధ్వానంగా తయారయ్యాయి. తరచు ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారనే విమర్శలు వస్తున్నాయి. ఎన్నో ఏళ్లుగా రోడ్ల పరిస్థితి ప్రమాదకరంగా ఉన్నప్పటికీ పట్టించుకునేవారు లేక వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నారు. ఆత్మకూరు మండలంలోని వివిధ గ్రామాల అంతర్గత రోడ్లు, ప్రధాన కేంద్రమైన గుడెప్పాడ్ జంక్షన్ రోడ్డు ప్రమాదకరంగా మారింది. ఈ జంక్షన్‌లో తరుచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు తూతూ మంత్రంగా మరమ్మత్తులు చేసి చేతులెత్తేస్తున్నారని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా పోలీస్ శాఖ మరమ్మత్తులు చేపడుతూ వాహనదారుల ప్రాణాలను రక్షిస్తున్నారని పలువురు అభిప్రాయపడుతున్నారు. కానీ సంబంధిత అధికారులు కన్నెత్తి చూడడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. పరకాల మండలం కనపర్తికి వెళ్లే రోడ్డు కంకరతేలి ప్రమాదకరంగా మారిందని, అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆగ్రహిస్తున్నారు. అలాగే దామెర నుంచి ల్యాదల్ల వెళ్లే ప్రధాన రహదారి మార్గంపై ఉన్న ఎస్సారెస్పీ కెనాల్ ఒక వైపు కూలిపోవడంతో రోడ్డు ప్రమాదకరంగా మారిందని, పరకాల–అంబాల ప్రధాన రహదారి, నడికుడ మండలం గొల్లపల్లి రోడ్డుపై గుంతలు ఏర్పడడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు తెలిపారు. శాయంపేట మండలం గంగిరేనిగూడెం నుంచి సూర్యనాయక్ తండాకు వెళ్లే రోడ్డు అడుగడుగునా గుంతలతో దర్శనమిస్తుందని, డివిజన్‌లో అధ్వానంగా ఉన్న రోడ్లను సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి మరమ్మత్తులు చేపట్టాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేస్తున్నారు.



అధ్వానంగా పరకాల-కనిపర్తి రోడ్డు



ప్రమాదకరంగా ల్యాదెళ్ల రోడ్డు



గుంతలమయంగా శాయంపేట-సూర్యనాయక్‌తండా రోడ్డు

నేటి నుంచి మండలస్థాయి క్రీడా పోటీలు

ధర్మసాగర్ : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా నేటి నుంచి 12వ తేదీ వరకు సీఎం కప్ మండలస్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అనిల్ కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం క్రీడా పోటీల నిర్వహణపై సమన్వయ సమావేశం నిర్వహించి మాట్లాడారు. నేడు ఉదయం 09 గంటలకు క్రీడలు ప్రారంభం అవుతాయని తెలిపారు. గ్రామాల్లో జరిగిన క్రీడా పోటీల్లో ఎంపికైన బాలబాలికలు సమయానికి హాజరు కావాలని సూచించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఎంపీఓ అఫ్జల్, బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం మురళి, పీఈటీ పాల్గొన్నారు.



ధర్మసాగర్ : సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ అనిల్‌కుమార్

వేలేరు : సీఎం కప్ మండలస్థాయి క్రీడా పోటీలను విజయవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి మల్లయ్య కోరారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎంపీఓ విమల అధ్యక్షతన వివిధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. నేటి నుంచి గురుకుల పాఠశాలలో జరిగే పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు తగిన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సూచించారు. తహసీల్దార్ కోమి, ఎంఈఓ చంద్రమౌళి, ఎస్సై సురేష్, ఎస్‌జీఎఫ్ మండల సెక్రటరీ రాజేశ్వరి, హెచ్ఎంలు రాజన్న, శ్రీదేవి, గురుకుల ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్, కబడ్డీ అసోసియేషన్ జిల్లా జాయింట్ సెక్రటరీ సద్దాంహుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

శాయంపేట : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నేటి నుంచి జరుగనున్న సీఎం కప్ మండలస్థాయి క్రీడా పోటీలకు క్రీడాకారులు హాజరు కావాలని ఎంపీడీఓ ఫణిచంద్ర సోమవారం ఒక ప్రకటనలో కోరారు. నేడు వాలీబాల్, కబడ్డీ, యోగా పోటీలు, 11న లాంగ్‌జంప్ పోటీలు ఉంటాయని ఆయన తెలిపారు.

ఆలయంలో రుద్రహోమం



ఎల్కతుర్తి : ప్రజాపాలన ఏడాది విజయవంతమైన సందర్భంగా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయంలో ఆలయ కార్యనిర్వాహణ అధికారి కిషన్‌రావు ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం రుద్రహోమం, స్వామి వారికి బిల్వార్చన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ముఖ్య అర్చకుడు రాంబాబు, అర్చకులు వీరభద్రయ్య, శ్రీకాంత్, వినయ్‌శర్మ, శివకుమార్, శరత్ చంద్ర, శ్రావణ్‌కుమార్, సిబ్బంది రవీందర్, నారాయణరావు, భిక్షపతి, రాజు, రాజయౌళి, కనుకయ్య, సమ్మయ్య, రాజమణి, శ్రీనివాస్, సతీష్, వెంకటేష్, కృష్ణ, శ్రీను, గ్రామ పాల్గొన్నారు.

రైతులకు దోమతెరల పంపిణీ

పరకాల : సామాజిక సేవ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని అరుణ ఫర్టిలైజర్స్ ఆధ్వర్యంలో ఫాక్ట్ కంపెనీ అధికారులు రైతులకు ఉచితంగా దోమతెరలను పంపిణీ చేశారు. దోమకాటు వలన జ్వరాల బారిన పడుతున్నారని, కంపెనీ ఫాక్ట్ సహాయంగా రైతులకు దోమ తెరలు పంపిణీ చేసినట్లు ఆ కంపెనీ ప్రతినిధులు తెలిపారు. వరంగల్ జోనల్ మేనేజర్ శివేంద్ర కుమార్, అసిస్టెంట్ మేనేజర్ విష్ణువర్ధన్ రెడ్డి, అరుణ ఫర్టిలైజర్స్ యాజమాని వెంకటేశ్వర్లు, డీలర్ ఆనందం, రైతులు పాల్గొన్నారు.

గ్యారంటీలకు బదులు గారడీ లెక్కలు

- బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ

పరకాల : అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీ పథకాలు అమలు చేస్తామని ప్రచారం చేసిన కాంగ్రెస్ నాయకులు నేడు గారడీ లెక్కలు చేస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ విమర్శించారు. పమోసపూరిత వాగ్దానాలతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. పట్టణంలో బీజేపీ పరకాల శాఖ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీతో పాటు కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 100 రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ నాయకులు.. నేడు గారడీ లెక్కలు చేస్తున్నారని అన్నారు. రాష్ట్ర ప్రజలను 66 మోసాలు చేసిన కాంగ్రెస్‌కు ప్రజలు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ కాళీప్రసాద్‌రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ విజయచందర్‌రెడ్డి, సంతోష్‌కుమార్, మండల, పట్టణ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రావు పద్మ

సాగులో జాగ్రత్తలు అవసరం

దామెర : నారుమడి యాజమాన్య పద్ధతిలో రైతులు జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ విస్తరణ అధికారి రామకృష్ణ కోరారు. సోమవారం మండలంలోని కోగిల్వాయి గ్రామంలో పలువురు రైతులకు చెందిన నారుమడులను ఆయన పరిశీలించి సూచనలు చేశారు. అధిక దిగుబడినిచ్చే విత్తనాలను ఎంపిక చేసుకొని విత్తుకోవాలని అన్నారు.

సీహెచ్‌సీలో వైద్యులను నియమించాలి

కమలాపూర్ : మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)లో వైద్యులు, వైద్య సిబ్బందిని వెంటనే నియమించాలని బీజేపీ మండల అధ్యక్షుడు కట్కూరి అశోక్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. గతంలో పీహెచ్‌సీగా ఉన్న ప్రభుత్వ ఆస్పత్రిని అప్పుడు ఆరోగ్యశాఖ మంత్రిగా ఉన్న ఈటల రాజేందర్ ఆరోగ్య కేంద్రంగా అప్‌గ్రేడ్ చేశారని గుర్తు చేశారు. అన్ని రకాల వసతులున్న ఈ ఆస్పత్రికి రోజురోజుకు రోగుల సంఖ్య పెరుగుతుందన్నారు. సరిపడా వైద్యులు మాత్రం అందుబాటులో లేరని, డిప్యుటేషన్‌పై వచ్చిన కొందరు వైద్యులే ఉన్నారని అన్నారు. రెగ్యులర్ వైద్యులు, స్పెషలిస్ట్ డాక్టర్లు లేరని, దీంతో మండల ప్రజలు చిన్నపాటి ఆరోగ్య సమస్యకు పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారని తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లలో జాప్యం చేయొద్దు

పరకాల : రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసే అంశంలో జాప్యం చేయొద్దని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కమిటీ సభ్యులు సావిత్రి, గడ్డం నాగార్జున రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు పరకాల వ్యవసాయ మార్కెట్‌ను సోమవారం సందర్శించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉన్నతాధికారులు వెంటనే దృష్టి సారించాలని సూచించారు.

ఘనంగా సోనియా గాంధీ జన్మదిన వేడుకలు

కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియా గాంధీ జన్మదిన వేడుకలను పరకాల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. అలాగే వివిధ మండలాలు, గ్రామాల్లో కేకులు కట్‌చేసి, పండ్లు పంపిణీ చేశారు. సోనియాగాంధీతోనే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సాకారం అయిందని కొనియాడారు. – సాక్షి నెట్‌వర్క్



ఆత్మకూరు : కేక్ తినిపించుకుంటున్న నాయకులు



ఎల్కతుర్తి : కేక్ కట్‌చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు



కమలాపూర్ : కేక్ కట్‌చేస్తున్న నాయకులు



శాయంపేట : పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు



పరకాల : ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో



వేలేరులో..

మత్తుపదార్థాలకు బానిస కావొద్దు

- సీఐ పులి రమేశ్

ఎల్కతుర్తి : విద్యార్థులు, యువకులు మత్తుపదార్థాలకు బానిస కావొద్దని, జీవితాలను నాశనం చేసుకోవద్దని సీఐ పులి రమేశ్ సూచించారు. మండల కేంద్రంలోని బస్టాండ్‌లో కళాశాల విద్యార్థులకు సోమవారం ఎస్సై రాజ్‌కుమార్‌తో కలిసి అవగాహన కల్పించారు. మత్తు పదార్థాల వలన కలిగే అనార్థాలను వివరించారు. డగ్స్ సమాజానికి పట్టిన చీడపురుగు వంటిందని, దానిని ఆదిలోనే నిర్మూలించాల్సిన అవసరం అందరిపై ఉందన్నారు. మత్తుకు బానిసై ఎంతోమంది విద్యార్థులు, యువత జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డగ్స్ మత్తులో కొందరు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ జీవితం బుగ్గిపాలు చేసుకుంటున్నారని అన్నారు. విద్యార్థులు మత్తు, మద్యం తదితర వ్యసనాలకు దూరంగా ఉండాలని, చదువుపై శ్రద్ధ వహించాలన్నారు. ఎవరైనా డ్రగ్స్ వినియోగించినా, లేదా విక్రయించినట్లు తెలిసినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం అందరం కృషి చేయాలన్నారు. అలాగే సైబర్ క్రైం నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అపరిచిత వ్యక్తులు కాల్‌చేసి ఓటీపీ నంబర్ అడిగితే చెప్పొద్దన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబల్ బుచ్చిలింగం, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ రమేశ్

ఆత్మన్యూనతా భావానికి లోనుకావొద్దు

- ఎంఈఓ ఆనందం

ఐనవోలు : దివ్యాంగులమని ఆత్మన్యూనతా భావానికి లోనవ్వద్దని, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని ఎంఈఓ పులి ఆనందం దివ్యాంగులకు సూచించారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం మండల కేంద్రంలో దివ్యాంగ విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుతులు అందించారు. ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగులు శారీరకంగా, మానసికంగా కొంత బలహీనంగా ఉన్నప్పటికీ అన్ని రకాల సామర్థ్యాలు వారిలో ఉంటాయన్నారు. వాటిని వెలికితీసి ప్రోత్సహిస్తే సాధారణ విద్యార్థుల మాదిరిగానే అన్ని రంగాల్లో రాణిస్తారన్నారు. తల్లిదండ్రులు, సమాజం వారిని చులకనగా చూడకుండా వారిలో ఉన్న సామర్థ్యాలను గుర్తించి ప్రోత్సహించాలన్నారు. హెచ్ఎం వెంకటేశ్వర్లు, ఐఈ ఆర్‌పీలు భవన్‌కుమార్, వసంత, ఉపాధ్యాయులు సారయ్య, లక్ష్మి, విజయ పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ ఆనందం

విజ్ఞానం, వినోదం పంచిన క్షేత్రపర్యటన



క్షేత్రపర్యటనలో విద్యార్థులు

ధర్మసాగర్ : రామప్ప, లక్నవరం క్షేత్ర పర్యటన విద్యార్థులకు విజ్ఞానం, వినోదాన్ని పంచిందని హెచ్ఎం ధర్మప్రకాశ్ అన్నారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల విద్యార్థులు యువ టూరిజంక్లబ్ ఆధ్వర్యంలో సోమవారం రామప్ప, లక్నవరాన్ని పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో యువ టూరిజం క్లబ్‌ను ఏర్పాటు చేసి తెలంగాణ దర్శిని పేరుతో రాష్ట్రంలోని వివిధ దర్శనీయ చారిత్రాత్మక ప్రాంతాల సందర్శనను ప్రోత్సహిస్తున్న సందర్భంగా విద్యార్థులు రామప్ప, లక్నవరాన్ని పర్యటించినట్లు తెలిపారు. దీని ద్వారా విద్యార్థులు రామప్పకు చెందిన చారిత్రక సాంస్కృతిక, శిల్పకళా ప్రాముఖ్యతను తెలియజేస్తూ కాకతీయుల పాలన అంశాలతో పాటు యునెస్కో ద్వారా రామప్ప ప్రపంచ వారసత్వ కట్టడంగా ఎన్నికైన విశేషాలను వివరించినట్లు చెప్పారు. లక్నవరం సరస్సు ప్రకృతి సౌందర్యం, సస్పెన్షన్ బ్రిడ్జి నిర్మాణంలో ఇంజనీరింగ్ స్కిల్స్‌ను తెలియజేసినట్లు పేర్కొన్నారు. అనంతరం బోటు షికారు చేసినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు కవిత, సురేష్, రాజమ్మ, రామకృష్ణ, సునీత, పీఎస్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ నియంత్రణకు ముందుకు రావాలి

ఎల్కతుర్తి : వేసక్టమీ కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌కు పురుషులు ముందుకు రావాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ విజయ్‌కుమార్ కోరారు. భీమదేవరపల్లి మండలం వంగరలో వేక్టమీ అవగాహన, శస్త్ర చికిత్సల పక్షోత్సవాల్లో భాగంగా సోమవారం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన కుటుంబ నియంత్రణ ఆపరేషన్ శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. పురుషులకు కోత, కుట్టులేని ఎన్ఎస్వీ ఆపరేషన్ చాలా తేలికైందని అన్నారు. దీని వలన ఏలాంటి ఇబ్బంది ఉండదని అన్నారు. ఈ శిబిరంలో 27మందికి కోత, కుట్టులేని ఆపరేషన్ చేసినట్లు చెప్పారు. మాతా శిశు సంక్షేమ ప్రోగ్రాం అధికారి డాక్టర్ నాగరాజు, వైద్యధికారి రహమాన్, రుబీనా, అశోక్‌రెడ్డి, ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీలో పాల్గొన్న డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ విజయ్‌కుమార్

ఇందిరమ్మ సర్వే నుంచి మినహాయించాలి

- పంచాయతీ కార్యదర్శుల వినతి

ఐనవోలు : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల యాప్ ద్వారా పంచాయతీ కార్యదర్శులు సర్వే చేపట్టాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని, ఇప్పటికే తమకు పనిభారం పెరిగిందని సర్వే నుంచి మినహాయించాలని పంచాయతీ కార్యదర్శులు కోరారు. ఈ మేరకు సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీఓ రఘుపతిరెడ్డి, ఆఫీస్ సూపరింటెంటెంట్ రూపేషకు వినతిపత్రం అందించారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వే చేయడం ద్వారా మరింత పనిభారం పెరుగుతుందని, ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరారు. పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శుల సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రఫీ, సభ్యులు ఎస్వీ కిశోర్, రాజ్‌కుమార్, తాజోద్దీన్, అనురాధ, నిర్మల్, లక్ష్మణ్, రఘురాం, రాకేష్, వేణుగోపాల్, ఆసిఫ్, రవి పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న కార్యదర్శులు

దామెరలో..

దామెర : ఇతర శాఖలకు సంబంధించిన పనులు, సర్వేలు, అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శులకు రక్షణ, కొన్ని మినహాయింపులు కల్పించాలని పంచాయతీ కార్యదర్శులు కోరారు. ఈ మేరకు సోమవారం ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. నాయకులు నరేష్, శ్రీనివాస్, మనోహర్ పాల్గొన్నారు.

పట్టాలు ఇవ్వాలని వినతి

శాయంపేట : జోగంపల్లి శివారు చలివాగు ప్రాజెక్టు కింద ఉన్న పంచరాయి భూములకు పట్టాలు ఇవ్వాలని కేవీపీఎస్ ఆధ్వర్యంలో అడిషనల్ కలెక్టర్ వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి సంపత్ మాట్లాడుతూ నాటి ఇందిరమ్మ ప్రభుత్వం చలివాగు ప్రాజెక్ట్ ఆయకట్టు కింద సుమారు 62 ఎకరాల భూమిని 130 మంది రైతులకు పంపిణీ చేసినట్లు తెలిపారు.

మంచి నడవడిక అలవర్చుకోవాలి

పరకాల : విద్యార్థుల నడవడికను తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు గమనించాలని, ప్రతీరోజు ఇంటి వద్ద చదువుకునే విధంగా చూడాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్ అన్నారు. సోమవారం విద్యార్థులు, తల్లిదండ్రులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు చదువుపై దృష్టి పెట్టేలా చూడాలని సూచించారు.

వినతిపత్రం అందజేత

ఆత్మకూరు : టీజీఎస్పీడీసీఎల్‌లో పనిచేస్తున్న అన్‌మ్యాన్డ్ కార్మికులకు పెరిగిన స్కిల్డ్ వేతనాలను నేరుగా బ్యాంక్ ఖాతాల్లో జమచేయాలని సీఐటీయూ ఎన్పీడీసీఎల్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం హనుమకొండ ఎస్ఈ వెంకటరమణకు వినతిపత్రం సమర్పించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వరంగల్ అర్బన్:
9951602875 9553955722
9010299096
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎల్. రాకేష్ వర్మ (S.R) : 9885438059 (హన్మకొండ)
వి. రాజ్‌కుమార్ యాదవ్ (S.R) : 9966290903 (ఎల్కతుర్తి)
ఎం. మధు (S.R) : 8639566261 (పరకాల)
కె. సుధాకర్ రెడ్డి (A.C.O) : 9177258410 (హన్మకొండ)